# బతుకు బాగోతం

అది మా మేనమామ ఊరు. మధ్యాహ్నం మద్దెల చప్పుడు విని, ఎంకుమామా నేను వెళ్ళి ఆ ఆట ఆడేవాళ్లను చూస్తూ నిలుచున్నం. వాళ్లు ఆకలిని మరిచి ఆనందాన్ని పంచుతున్నరు. కడుపులో కాలేపేగులు అరుస్తూ ఉంటే హాస్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సత్తువ లేని శరీరం సోలుతూవున్నా మద్దెల తాళాలకు అనుకూలంగా ఆడుతూ పాడుతున్నరు.

" మధ్యాహ్నం ఈ బాగోతం ఏంది మామ" అన్న

" ఈ వారం రోజుల నుండి రాత్రిపూటే ఆడింద్రు. ఈరోజు మాతంగుని సంవాదం ఎల్లమ్మ వేషం కాబట్టి పగలు ఆడుతున్నరు" అన్నడు ఎంకు మామ.

మేము ఆట ఆడేచోటికి వెళ్ళే వరకు మాతంగుని-బ్రాహ్మణుని సంవాదం జరుగుతుంది. మాతంగుడు తన మూలాలు చెబుతూ తాను శుద్ధి చేసిన వారు (చర్మం) ఏయే కులాలు వాడుతన్నరో చెపుతున్నడు.

" అంటిముట్టరాని బాపని కులపు జంధ్యానికి వున్నది నా వారే " మాటలకు అనుగుణంగా చూస్తు, శరీరాన్ని కదిలిస్తున్నడు.

" ఆ ఆ ఆ ఆ " అంటూ పక్క వాయిద్యకారుని రాగాలపన.

బ్రాహ్మణుడు బిత్తర పోయి అటు ఇటు చూస్తున్నడు.

" కమ్మరి కొలిమికి నావారే "

" ఆ ఆ ఆ " అని అలాపన

బ్రాహ్మణుని బెదురుచూపులు

" మోటబావికి నావారే "

" ఆ ఆ ఆ " అని అలాపన

బ్రాహ్మణుడు ఒప్పుకున్నట్టు తలాడించిండు.

" నీళ్ల తిత్తికి నావారే "

అంతవరకు పక్కన నిల్చున్న నర్తకి, వయ్యారంగా బ్రాహ్మణ వేషదారి పైపైకి పోతూ " నా జాతకం చెప్పవా పంతులూ" అని కనుసైగ చేసింది. నోట్లో నాలుకను మెలకేసి చూసింది

" ఛీ ఛీ చెండాలిక నీకు నేను జాతకం చెప్పాలా ? " అంటూ పక్కకు తొలిగి ముఖం చిట్లించుకుని నిలుచుండు.

" మరీ మరీ నిన్న ఏట్లో జలకమాడుతున్నప్పుడు గట్టున నిల్చొని ఓ అందాల రాశీ, అపూరుప సుందరీ అని గుటకలు మింగితివి కదా " అన్నది వంటిని వంకరలుగా తిప్పుతు రెక్కలను పక్కకు వడేసుకుంటు.

" నేనా కానేకాదు. అతడు మీవాడే కడజాతి వాడు అయి వుంటాడు. సరిగ్గా గుర్తు తెచ్చుకో " అంటు గోచి సర్దుకుండు. ఎంకు మామ పడీపడి నవ్వుతుంటే నాకు నవ్వు ఆగలేదు.

" అవును లే ఒంటరిగా కనిపిస్తే కన్నుగొడతరు.మందిలో కనిపిస్తే తరిమి గొడతరు. " పాడు బుద్దులు అంది.

జనంలో నవ్వులు, ఆమే నవ్వుతూ పక్కకు నిలుచుంది.

" ఆ ఆ ఆ " అని అలాపన

" చల్ల కవ్వానికి నావారే " అంటు మాతంగుడు మధ్యలోకి వచ్చిండు.

" ఆ ఆ ఆ "

" నేను ఎవరనుకున్నవు బ్రాహ్మణోత్తమా ఈ సృష్టికి మూలవాసున్ని " అని నవ్వు ముఖంతో చుట్టు చూసిండు. జనం చప్పట్లతో ఆమోదించినట్టు చూశారు.

నేను ఎంకి మామ భుజం మీద చేయి వేసి కదిలిస్తూ, ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. తోలు పోయి ప్లాస్టిక్ వచ్చింది.

" ఆల్లు చెప్పేది ఆనాటి కథ " అన్నడు ఎంకు మామ.

గంజి మెతుకుల కోసం ఎన్నిపాట్లు " అనుకుంటు అటువైపు చూసిన. వాళ్ల వేషాలకు ధరించే గుడ్డలను. ఇల్లిల్లు తిరిగి అడుక్కుంటరు. పాత గుడ్డలను ఇచ్చిన వాళ్లను పారితోషికం ఇచ్చిన వాళ్లను ధర్మప్రభువులని కొనియాడుతూ వుంటరు. వాళ్ల ప్రదర్శనకు ఏ మాత్రం సహాయం చేసినా వాళ్లను దొడ్డ ప్రభువులని అంటుంటారు. ముఖ్యంగా వాళ్లకు ఆడడానికి అవకాశం కల్పించి ఊళ్లో వున్నన్ని రోజులు తినడానికి తిండి, ఉండడానికి వసతి కల్పించి ఆకర్న అంతో ఇంతో నగదును సమకూర్చే దళితులను మహాధాతలుగా మాట మాటకు పొగుడుతూ వుంటరు. అడుగడుగున తమ కృతజ్ఞతలను తెలుపుకుంటూ వుంటరు. వీళ్లు చూడడానికి మంచి ముక్కూముఖం కలిగి వుంటరు. వీళ్ల ఆడవాళ్లు అందంగానే వుంటూ అందరితో కలిసిమెలసి తిరుగుతూ నవ్వుతూ నవ్విస్తూ వుంటరు. వీళ్లలో ఓ అందమైన బాలికను ఎల్లమ్మ పేరిట వదిలిపెడతరు. ఆమెకు యుక్త వయస్సు వచ్చినా పెళ్ళి చేయరట. వాళ్ల చిందు కులంలో ఆమెను చాలా పవిత్రంగా చూస్తారట. దళితులు ఆమెను శృంగారపు చూపులతో చూస్తూ అంతో ఇంతో ఇచ్చి అనుభవిస్తూ వుంటరట. ఎల్లమ్మ వేషం కట్టె ముందు వెనక రోజులు ఆమె ఎవ్వరితో సంబంధం లేకుండా ఉపవాసదీక్షలో వుంటుందట. పసుపు కుంకుమలతో పవిత్రంగా కనిపిస్తుంది.

ఆ సాయంసమయం ఆట ముగింపునకు వచ్చింది. అందరు అటువైపు చూపులు మళ్లించి డప్పు చప్పుడు వైపు చెవులుంచారు. అంతలోనే వేదిక మీద నుండి ఓ ప్రకటన వెలువడింది.

" అయ్యాల్లారా, అమ్మల్లారా ఈ వూరి ధర్మ ప్రభువులారా, ఇప్పుడు మామిడాల ఎల్లమ్మ దేవత రానున్నది. తామంతా భక్తితో కానుకలు ఇచ్చుకోవల్సిందిగా ప్రార్థన "

" అమ్మో మాయమ్మ మామిడాల ఎల్లమ్మ కోటోక్క దండాలు, కోడిపుంజు బోనాలు " అంటూ తదనుగుణంగా మద్దెల తాళాలు. ఒక్కసారే అక్కడి

వాతావరణం అంతా మారిపోయింది. హాస్యపు మాటలు, ఆనందపు చూపులుపోయి అక్కడంతా భక్తి భావం ఆవరించింది.

డప్పుల చప్పుడు పెరుగుతుంది. దళిత వాడలో నుండి ఎల్లమ్మ వేషం వేదిక వైపు వస్తూ వుంది. వస్తూ వస్తూ మధ్యన వున్న మారెమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ, ఉప్పలమ్మ గుళ్ల దగ్గర ఆగుతూ పసుపు కుంకుమను పంచుతూ వస్తున్నది.

ఎల్లమ్మ వేషం వేసిన జోగినికి నలబది ఏళ్లుంటాయి. ముఖమంత పసుపు కుంకుమ, తలకు, నడుముకు వెనక ముందు గవ్వలపట్టీలు. అట్లాగే భుజాలకు, మణికట్టు దగ్గర, గవ్వలు పొదిగిన పట్టీలే కట్టి ఉన్నాయి. ఓ చేతిలో పసుపు కుంకుమల బొట్టులతో గల పెద్ద కత్తి. దాని చివరన నిమ్మకాయ మరో చేతిలో వేపకొమ్మలు. కళ్లు పెద్దవి చేసి, చూసే వాళ్లకు భయం గొలిపే విధంగా ఆవేశం, ఎంతో ఉత్సాహ ఉద్రేకాలతో వస్తూ వుంది. జనం కొబ్బరికాయలను సమర్పించగానే వెంట వున్న వ్యక్తి ధూప-దీపాన్ని, హారతినిచ్చి కొబ్బెరకాయలను కొడుతూ ఉన్నడు. ఎల్లమ్మ వేషం ఊరంతా తిరిగి రావడం, ఆ వేషం ఎవరి ఇంటి ముందుకు చేరితే ఆ ఇంటి ముందు వాళ్లు భక్తిశ్రద్ధలతో కల్లుసాకలు పెట్టడం, కొబ్బరకాయలు కొట్టడం చూస్తూ నిలుచున్న, మూఢ నమ్మకాలు మనిషిని మాయ చేసేది ఆలోచిస్తున్న.

గ్రామం నడిబొడ్డున వున్న పోతరాజు దగ్గర కొంతసేపు ఆగి, నిమ్మకాయలను రెండుగ కోసి చుట్టూ విసిరి వేసారు. చేతుల్లో వేప కొమ్మలను ధరించి ఇంకా కొంతమంది గణాచారులు ఊగుతూ, గునుస్తువచ్చి ఎల్లమ్మతో పాటు ఊగుతున్నరు. డప్పుల దర్వు ఊరంతా మారు మోగుతువుంది. పిల్లలు బెదిరి బెదిరి చూస్తు భయం భయంగా నడుస్తున్నరు. భక్తితో చేతులు జోడిస్తు నడుస్తున్నరు పెద్దలు.

ఎల్లమ్మ వేషం ఊరంత తిరిగి దళిత వాడవైపు మళ్లింది. ఆమె ముందు

డప్పులు ఆమె వెనకాల పిల్లలు, పెద్దలు.

*

బొంబాయికి బతుకటానికి వెళ్లిన వాళ్ల ఇంటిలో వీళ్ల బస. పదో పరకో కొడుకులు పంపితే తింటూ ఆ యింటిని ఊకి చల్లుతూ వుంటది. అంతకు ముందే ఆమె భర్త బొంబాయిలోనే కొత్తగా కడుతున్న ఇంటిగోడ కూలిపోగా చనిపోయిండు. ఆ ఇంట్లో ఒక్కతే. ఆ ఇంటి ముందు మంచి నీళ్ల చేదబావి కూడ వుంది. అందుకని ఆ ఇంట్లో ఇలాంటి దేశదిమ్మరులు దిగుతు ఉంటరట. ఇంటింటిని అడుక్కుని తింటూ ఆ ఇంట్లో వుంటున్నరు చిందోళ్ళు. నేను అక్కడికి వెళ్లింది గమనించి, నమస్కరిస్తూ వచ్చి ముందు నిలుచున్నరు. ప్రతి నమస్కారం చేసి ఆ ఇంటి యిడుపుకు వున్న అరుగు మీద కూర్చున్న. వాళ్లను కూర్చోమని సైగ చేసిన. వాళ్లు అరుగు మీద కూర్చోక కింద కూర్చున్నరు.

" మాకు అన్నం పెట్టే దాతలతో సమానంగా కుసోకూడదు తండ్రి " అన్నరు. నాకళ్లు నిన్న ఎల్లమ్మ వేషం వేసిన ఆమెను వెతుకుతున్నయి. నిన్నంతా ఆమె ప్రదర్శించిన తీరు ఓ ప్రత్యేక సన్నివేశం కదా.

" ఎన్ని రోజులుంటరు ఈ ఊర్లో "

" ఇంకా వారం పదిరోజులుంటం. అప్పటి వరకు మా దాతలు తేగం ఇస్తరు. ఆతరువాత మరో ఊరు పోతం " అన్నడు. వాళ్లలో ఓ పెద్దాయనే అనుకుంటు గోసంగి వేషంతో వాదనకు దిగే బ్రాహ్మణ వేషదారి.

" తేగం అంటే "

" మాకిచ్చే కట్టడి. మా సిందోల్లం అంత కలిసి గుంపులుగ అయి, గుంపుకో పట్టె ఊర్లను పంచుకుంటం. ఆ పంచుకున్న గ్రామంలో వుంటున్న దళితులు జనాభాను పట్టి వాళ్లు మాకు పెట్టే తిండి, ఇచ్చే డబ్బులను బట్టి వారం అటుయిటు మాకొచ్చిన వూరు మళ్లి రావడానికి మూడేండ్లు పట్టుతది" అన్నరు.

" అంటే ఎప్పుడు తిరుగుతూనే వుంటరా "

" అంతే కదా తండ్రి తిరగంది పొట్టకెట్ట ఎల్తది "

" ఇంకా వేరే ఏ పని చెయ్యరా "

" సెయ్యం మా దళిత ప్రభువులకు ఆట ఆడి, పాట పాడి, నవ్విచ్చి మురిపించి అడుక్కొని బతుకుతుంటం. " అన్నరు.

ఈ లోపు అక్కడికి ఓస్త్రీ వొచ్చి నిలుచుంది. ఆమె ముఖం అందంగా ఉన్నా అలసటగా వుంది. మంచి విగ్రహం అయినా పేదరికపు వస్త్రధారణ. సిగలో పూలు నలిగి ఉన్నయి. కళ్ల కాటుక కళ్ల చుట్టు వెడల్పుగా పరుచుకుంది. నుదుట బొట్టు చెదిరివుంది.

" ఈమే నిన్న ఎల్లమ్మ వేషం ఏసింది " అన్నడు వాళ్లల్లో ఒకడు.

ఆమెలో నిన్నటి భీకర రూపం, భయంకరపు చూపులు లేవు.

' ఈమెను జోగుకు ఇడిసినం. ఈమె మహా దళిత మారాజుల సంతోష పెట్టే వేశ్య అన్నమాట. అసలు చెప్పాలంటే మేము దళితుల బోగమొల్లం. అన్ని రకాలుగా ఆళ్లను మేం అలరించాలి " అన్నడు.

చూడండి ఇట్లా మీ ఆడవాళ్లను జోగినిగా మార్చకుండా వుండలేరా?

అది మా కులాచారం. తరతరాల నుండి వస్తున్నది. జాంబ పురాణం నుండొస్తున్న సాంప్రదాయం అన్నడు. ఆ బ్రాహ్మణ వేషదారి.

నీపేరు

" ఇంద్రయ్య " అన్నడు.

ఆ ఎల్లమ్మ వేషం వేసినామె పేరు?

" ఊర్వసి " అన్నడు

ఒక్కసారి కదిలి కూర్చుంటూ ఓహో ఇద్దరివి పురాణాలలోని పేర్లే! మనస్సులో అనుకుంటు మాతంగుని వేషం వేసిన వ్యక్తి వైపు చూస్తూ నీపేరు ?

" జాంభవుడు " అన్నడు వినయంగ.

నీవు మాతంగుని వేషం వేస్తావు కదా మాతంగుని బ్రాహ్మణ వేషం దారుని సంవాదాన్ని రాసి ఇవ్వండి

" అయ్యా మీకు రాసిచ్చేంత సదువు మాకు రాదుకదా " అన్నరు.

వచ్చినంతలో రాసివ్వండి ఫరవలేదు

వాళ్లు మౌనం వహించారు.

వాళ్ల ముఖాలు రంగు వెలిసి వున్నయి. కడుపులోని ఆకలి కళ్లల్లో కనిపిస్తుంది.

కాలం చాలా వేగంగా మారిపోతుంది. మీరూ మారాలి. ఈ కులవృత్తి మాని

చదువుకుని నలుగురితో పాటు పనీ పాటలు చేసుకొని బ్రతకాలి. అన్నప్పుడు నా మాటను విని కూడా విననట్టు చూస్తు..

" అందరు పనిచేస్తూ పోతే మరీ పాట సంగతి " అన్నడు ఇంద్రయ్య.

ఆమాటలోని లోతు నాకర్థమైంది కాని వీరు అడుక్కుని ఆకలి తీర్చుకోవడం సరియైంది కాదు. స్త్రీని అంగడి బొమ్మలాగ చేయడం అంతకంటె మంచిది కాదు.

" బస్సువచ్చే టైం అయింది పదా " అంటు ఎంకు మామరాగానే ఇద్దరం చావడివైపు నడక సాగించినం.

● జనవరి 1999